# సబితమ్మకే.. దళిత బహుజనుల మద్దతు

- డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్ ఆధ్వర్యంలో మంత్రికి ఘన స్వాగతం
- బ్లూ తలపాగాలతో జై భీమ్.. జై సబితమ్మా అంటూ నినాదాలు
- అభివృద్ధికి పట్టం కడుతామని నినాదాలు
- సబితమ్మ గెలుపు కోసం.. శేఖర్ భారీ ర్యాలీ
- బాలాపూర్ రోడ్ షోలో మంత్రికి హారతులు



బాలాపూర్ రోడ్ షోలో మాట్లాడుతున్న మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి చిత్రంలో ప్రచారం రథంపై డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, తదితరులు

బడంగ్‌పేట, నవంబర్ 27: బాలాపూర్‌లో రోడ్ షో కార్యక్రమానికి సోమవారం విచ్చేసిన విద్యాశాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డికి బడంగ్‌పేట డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. దళిత బహుజనులంతా సబితమ్మకు మద్దతు తెలుపుతూ భారీ ర్యాలీ నిర్వహించారు. బ్లూ తలపాగాలు చుట్టి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి మంత్రి సబితా ఇంద్రారెడ్డి చేతుల మీదగా గజమాల వేసి అంబేద్కర్‌కు నివాళులర్పించారు. ఇబ్రాం శేఖర్ ఆధ్వర్యంలో భారీగా తరలి వచ్చిన మహిళలు మంత్రికి హారతులు ఇచ్చి ఆశీర్వదించారు. బాలాపూర్ అంతా గులాబీమయంగా మారింది. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ శేఖర్ మాట్లాడుతూ పార్టీలకు సంబంధం లేకుండా డిప్యూటీ మేయర్ కావడానికి పూర్తి స్థాయిలో సహకరించిందన్నారు. అంత పెద్ద సహాయం చేసిన మంత్రికి ఆమె రుణం తీర్చుకోవాలన్న ఉద్దేశంతో దళిత బహుజనులంతా బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి సబితా ఇంద్రారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించడానికి తమ వంతు బాధ్యత నెరవేర్చుతామన్నారు. మంచి చేసిన వారిని ఎవరు మర్చి పోకూడదన్నారు. మహేశ్వరం నియోజక వర్గం అభివృద్ధి కావాలంటే మరోసారి సబితా ఇంద్రారెడ్డిని గెలిపించాలని ఆయన ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. గడిచిన నాలుగున్నర సంవత్సరాల కాలంలో మహేశ్వరం అన్ని విధాలుగా మంత్రి అభివృద్ధి చేశారు కనుకనే అభివృద్ధి చేసిన వారికి పట్టం కట్టాలని ఓటర్లకు విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. బలహీన వర్గాలకు న్యాయం జరగాలంటే సబితా ఇంద్రారెడ్డిని గెలిపించాలని ఆయన కోరారు. మాట మీద నిలబడే మంత్రికి ఈనెల 30న కారు గుర్తుపై ఓటు వేసి గెలిపించాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు లక్ష్మారెడ్డి, గిరీష్, కొప్పుల రాజు, ఎల్లరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, దళిత బహుజన నాయకులు తదితరులు ఉన్నారు.



సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తలసాని, తదితరులు

# బీఆర్ఎస్ గెలుపునకు అభివృద్ధే నాంది

*మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్*

బేగంపేట్ నవంబర్ 27: తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి, పేద ప్రజల సంక్షేమ కార్యక్రమాలే బీఆర్ఎస్ పార్టీ గెలుపునకు దోహద పడతాయని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సనత్‌నగర్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అమీర్‌పేట్, రాంగోపాల్‌పేట్, బన్సీలాల్‌పేట్ డివిజన్‌లలో సోమవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. వీటితో పాటు వివిధ అసోసియేషన్లు నిర్వహించిన సమావేశాల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఓ వైపు ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధిని కూడా ప్రచారం చేస్తున్న సమయంలో ప్రజలు వారే వివరిస్తున్నారన్నారని తెలిపారు. నియోజకవర్గంలో అన్ని కులమతాలకు వారి నుంచి మంచి ఆదరణ లభించిందన్నారు. ఈ తొమ్మిదిన్నరేండ్లలో నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల కండ్ల ముందే కనిపిస్తున్నాయని చెప్పారు. సమస్యలు అనేవి నిరంతరంగా ఉంటాయి. కాబట్టి, మరోసారి తనను అధిక మెజార్టీతో గెలిపిస్తే మిగిలిన సమస్యలను కూడా పరిష్కరిస్తామని తెలిపారు. సంక్షేమ ఫలాలు, డబుల్ బెడ్‌రూం ఇండ్లు రాని వారు ఏ మాత్రం బాధపడొద్దని బీఆర్ఎస్ ప్రభుత్వం మరోసారి ఏర్పాటయ్యాక తప్పకుండా ఇండ్లు వచ్చేలా కృషి చేస్తామని తెలిపారు. బీఆర్ఎస్ సర్కార్‌పై నమ్మకంతో ఉండాలని చెప్పారు. జీహెచ్ఎంసీ పరిధిలో ఇప్పటి వరకు 70వేల మందికి ఇండ్లను పంపిణీ చేశామన్నారు. మరో 30 వేలు నిర్మాణం జరుగుతున్న విషయాన్ని వివరించారు. మళ్లీ మనమే అధికారంలోకి రాబోతున్నామని సంక్షేమ పథకాలు అందని వారు బాధపడవద్దని రాబోయే కాలంలో అర్హులైన ప్రతి ఒక్కరికి అందజేస్తామని తెలిపారు.

# పేదల భూ సమస్యలు పరిష్కరిస్తాం

**అభ్యర్థి మర్రి రాజశేఖర్ రెడ్డి**



గౌతంనగర్ డివిజన్ ఐఎన్ నగర్ సమావేశంలో మాట్లాడుతున్న అభ్యర్థి మర్రి రాజశేఖర్ రెడ్డి

మల్కాజిగిరి / నేరేడ్‌మెట్, నవంబర్ 27: పేద ప్రజల భూ సమస్యలు పరిష్కరిస్తామని అభ్యర్థి మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. గౌతంనగర్ డివిజన్ అన్నపూర్ణ సొసైటీ అధ్యక్షుడు రమణా రెడ్డి ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా అభ్యర్థి మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, బీఆర్ఎస్ పార్టీ పేదల అభివృద్ధి కోసం కృషి చేస్తుందన్నారు. గత మూడు దశాబ్దాలుగా మల్కాజిగిరి సర్కిల్ సర్వే నం: 278లో 22 కాలనీలలో దాదాపు లక్ష మంది నివసిస్తున్నారని అన్నారు. ఇందులో దాదాపు 40 వేల మంది ఓటర్లు ఉన్నారని అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన జీవో నం:59లో దరఖాస్తు చేసుకున్న వారికి గజానికి రూ.26,700 వేలు కట్టాలని నోటీసులు ఇచ్చారని అన్నారు. పేదలు అంత డబ్బు చెల్లించలేక ఇబ్బందులు పడుతుంటే, విషయాన్ని మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకువెళ్లాలని అన్నారు. వెంటనే స్పందించి జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి జీఓ నం:118 కింద గజానికి రూ.250 చెల్లించి స్థలాలను రెగ్యులరైజ్ చేసుకోవడానికి వీలుగా జీవోను తీసుకువచ్చామన్నారు. ఐఎన్ నగర్, వినాయక్‌నగర్, మల్కాజిగిరి, మౌలాలి ప్రాంతాలలో ఉన్న భూములతో పాటు వక్ఫ్ భూముల సమస్యను పరిష్కరిస్తామని అన్నారు. ప్రజలకు పూర్తి భరోసా కోసం అభివృద్ధిని చూసి ఓటుతో మద్దతు తెలపాలని కోరారు. కార్యక్రమంలో ఎంబీసీ చైర్మన్ ఎన్.శ్రీధర్, కార్పొరేటర్ సునీత రాము, జీతేందర్ రెడ్డి, రాము, సిద్ధి రాములు పాల్గొన్నారు.

# శంషాబాద్‌ను అభివృద్ధి చేశాను.. ఆశీర్వదించండి

- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్
- శంషాబాద్ మున్సిపాలిటీలో జోరుగా ఎన్నికల ప్రచారం



శంషాబాద్ ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్, మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మారెడ్డి, తదితరులు

శంషాబాద్ రూరల్, నవంబర్ 27: రాజేంద్రనగర్ నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశానని, మరోసారి ఆశీర్వదిస్తే మరింత అభివృద్ధి చేస్తానని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి టి.ప్రకాశ్ గౌడ్ తెలిపారు. సోమవారం శంషాబాద్ మున్సిపాలిటీలోని యాదవ్ బస్తీ, కాపుగడ్డ, కుమ్మరి బస్తీ, మొయిన్ మైలా, పోచమ్మ గడ్డ, 4, 5, 6, 7, 8, 18, 19, 20, 21, 22 వార్డులతో పాటు రాళ్లగూడ, సిద్ధాంతి, సాతంరాయి తదితర ప్రాంతాలలో మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మారెడ్డి, రాష్ట్ర నాయకుడు గణేష్ గుప్త, వైస్ చైర్మన్ బండి గోపాల్ యాదవ్‌తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్డు షోలో ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ మాట్లాడుతూ, రాజేంద్రనగర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేశానని మరోసారి తనను ఆశీర్వదిస్తే మరింత అభివృద్ధి చేస్తానని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుతో సీఎం కేసీఆర్ ప్రజల సంక్షేమం అభివృద్ధే లక్ష్యంగా పెట్టుకొని పాలన సాగిస్తున్నట్లు తెలిపారు. 50 ఏండ్లు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రజలకు అభివృద్ధి ఫలాలు అందకుండా దోచుకున్నారని విమర్శించారు. ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. మరోసారి బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు.

# శేరి లింగంపల్లిలో గులాబీ రెపరెపలు ఖాయం

**గాంధీకి రోజు రోజుకు పెరుగుతున్న మద్దతు**



కొండాపూర్‌లో నిర్వహించిన ప్రచారంలో అభ్యర్థి అరెకపూడి గాంధీ

కొండాపూర్, నవంబర్ 27: శేరి లింగంపల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి అరెకపూడి గాంధీకి ప్రజల మద్దతు రోజు రోజుకు పెరిగిపోతుంది. నియోజకవర్గంలోని ప్రజలు స్వచ్ఛందంగా మద్దతును ప్రకటిస్తూ, ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపిస్తామంటూ బహిరంగంగానే ప్రకటిస్తున్నారు. కొండాపూర్ డివిజన్ పరిధిలోని జాగృతి కాలనీ, రసున్ అపార్ట్‌మెంట్స్ వాసులు అభ్యర్థి అరెకపూడి గాంధీని సోమవారం సన్మానించి మద్దతు ప్రకటించారు. అనంతరం, ఆయన మాట్లాడుతూ, బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమంలో దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. మరోసారి బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. నియోజకవర్గ ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం తొమ్మిదేండ్లుగా నిరంతరం కృషి చేస్తున్నానని, మరోసారి భారీ మెజార్టీతో గెలిపించాల్సిందిగా ప్రజలను కోరారు. ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి గులాబీ జెండాను ఎగరేయాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

# అన్ని రంగాలలో లష్కర్ అభివృద్ధి

- మద్దతు తెలిపేందుకు ముందుకు వస్తున్న కుల సంఘాలు
- మా గెలుపునకు అభివృద్ధే శ్రీరామరక్ష: పద్మారావు గౌడ్



సవరాల బస్తీలో ముస్లిం సోదరులను కలిసి ఓటు అభ్యర్థిస్తున్న పద్మారావు గౌడ్

సికింద్రాబాద్, నవంబర్ 27: సికింద్రాబాద్ నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేశామని డిప్యూటీ స్పీకర్, బీఆర్ఎస్ పార్టీ సికింద్రాబాద్ నియోజకవర్గ అభ్యర్థి తీగుల పద్మారావు గౌడ్ స్పష్టం చేశారు. సీతాఫల్ మండి డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాలలో స్థానిక కార్పొరేటర్ హేమతో కలిసి తన ఎన్నికల ప్రచార పాదయాత్రను సోమవారం ప్రారంభించారు. కార్యకర్తలు, అభిమానులు, నాయకులు, ప్రభుత్వ వివిధ పథకాల లబ్ధిదారులు పాదయాత్రలో పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్ళి తాను చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. అలాగే, తమ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పొందు పరిచిన పలు అంశాలు, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. మ్యానిఫెస్టో ఉన్న కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. పద్మారావుకు అడుగడుగునా స్థానిక ప్రజలు ఘన స్వాగతం పలికారు. పద్మారావుపై గులాబీ పూల వర్షం కురిపించారు. ఇక అభిమానులు గజ మాలలతో స్వాగతం పలికారు. మహిళలు మంగళ హారతులు పట్టి ఘనంగా ఇళ్ళలోకి ఆహ్వానించారు. పద్మారావుకు బస్తీల ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా పద్మారావు గౌడ్ మాట్లాడుతూ, సికింద్రాబాద్ నియోజకవర్గంలో కుంటు పడిన అభివృద్ధిని కేవలం తొమ్మిదేండ్లలోనే చేసి చూపించామన్నారు. అన్ని వర్గాల ప్రజల కష్ట సుఖాలలో పాలు పంచుకున్నామని చెప్పారు. నియోజకవర్గ ప్రజల ఆదరణ చూస్తుంటే భారీ మెజారిటీతో గెలవడం ఖాయమన్నారు.